جمعية إحياء التراث الإسلامي

مسائل الطهارة، والصلاة، و الجنائز
(بلغة التلغو)

# ప్రవక్త ముహమ్మద్ ﷺ నమాజు విధానము

## శుచి శుభ్రత మరియు అంత్యక్రియల విధానము


కూర్పు
జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ



مركز الهداية لتوعية الجاليات

# జనాయెజ్ ప్రకరణం

# జనాయెజ్ ప్రకరణం (అంత్యక్రియలు)

## బాధకు గురికాబడే మరియు ఇతరులను పరామర్శించేవారి ఘనత

హజ్రత్ అబూ జర్ర్ رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: “మంచి పనిని ఏమాత్రం హీనంగా భావించకు. నీ సోదరుడిని చిరు నవ్వుతో కలుసుకోవడం కూడా పుణ్యకార్యమైనది” (ముస్లిం).

హజ్రత్ సౌబాన్ رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: “ఒక ముస్లింను పరామర్శించటానికి వెళ్ళి తిరిగి వచ్చేవరకూ అతను స్వర్గంలో తాజా పండ్లను ఏరినట్లు” (ముస్లిం).

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ رضي الله عنه అబూహురైరా رضي الله عنه కథనం ప్రకారం. ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: “ముస్లింకు ఏ విధమైన ఆపద వచ్చినా, బాధ కలిగినా, ఆందోళన కలిగినా, దుఃఖం కలిగినా, చివరికి ముల్లు గుచ్చుకున్నా సరే దాన్ని అల్లాహ్ అతనికై పాప పరిహారంగా చేస్తాడు” (బుఖారీ).

ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: “ఎవరికైతే అల్లాహ్ మేలు చెయ్యాలనుకుంటున్నాడో అతనికి బాధలతో పరీక్షిస్తాడు” (బుఖారీ).

ఒక సారి ఒక నల్లటి మహిళ ప్రవక్త ముహమ్మద్ ﷺ సన్నిధికి వచ్చి “నాకు మూర్ఛ వస్తూ ఉంటుంది. అప్పుడు నా ఒంటి మీద బట్టలు కూడా తొలిగిపోతాయి. అందుచేత నా కోసం అల్లాహ్‌ను ప్రార్థించండి” అని మనవి చేసుకున్నది. దానికి ప్రవక్త ముహమ్మద్ ﷺ సమాధానమిస్తూ “నీవు తలిస్తే (ఈ బాధపట్ల) సహనం వహించవచ్చు. ఆ సహనానికి బదులుగా నీకు స్వర్గం లభిస్తుంది. ఇక నీవు కోరినట్లయితే నేను నీ కోసం నీ బాధ

దూరం కావాలని అల్లాహ్‌ను ప్రార్దిస్తాను'' అని అన్నారు. దానికామే 'సరే నేను సహనం వహిస్తాను' అని అన్నది. ఆ తరువాత కాస్సేపటికి 'కాని నా ఒంటి మీద బట్టలు తొలిగిపోతాయి. ఇవి తొలిగిపోకుండా ఉండేందుకు (అయినా) అల్లాహ్‌ను ప్రార్థించండి' అని అన్నది. ప్రవక్త ముహమ్మద్ﷺ ఆ ప్రకారం ఆమె కోసం ప్రార్థన చేసారు. (బుఖారీ)

హజ్రత్ అబూ హురైరాؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''ఎవరైతే ఉరి వేసుకొని చనిపోతాడో అతను నరకంలో ఉరి వేసుకొనే శిక్షను అనుభవిస్తాడు. ఎవరైతే కత్తితో పొడుచుకొని చనిపోతాడో అతను నరకంలో కత్తితో పొడుచుకొనే శిక్షను అనుభవిస్తాడు'' (బుఖారీ).

హజ్రత్ అబూ హురైరాؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''ప్రతి ముస్లింపై సాటి ముస్లింకు ఆరు బాధ్యతలున్నాయి. అప్పుడు అక్కడున్నవారు అవి ఏవి? అని అడగ్గా; ఆయన ఈ విధంగా బోధించారు:

1) ముస్లిం సోదరుడిని కలిస్తే అతనికి సలాం చెయ్యి.
2) అతను విందుకు ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించు.
3) అతను ఉపన్యాసం చెయ్యమని కోరితే ఉపన్యాసం చెయ్యాలి.
4) అతను తుమ్మి**''అల్ హమ్దులిల్లాహ్''**అంటే, నీవు దానికి **'యర్‌హముకల్లాహ్'**అని బదులివ్వు(ఆ తరువాత జవాబుకు ప్రతి జవాబుగా: **యహ్‌దీకుముల్లాహు వ యుస్‌లిహ్ బాలకుమ్** అని చెప్పాలి).
5) అతను వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు.
6) అతను చనిపోతే అతని జనాజాకు (నమాజుకు మరియు శ్మశానానికి) తోడుగా వెళ్ళు'' (ముస్లిం).

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''ఎవరైతే వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటానికి పోయి, అతని తల దగ్గర కూర్చొని ఏడు సార్లు:

**'అస్ అలుల్లాహల్ అజీమ, రబ్బల్ అర్షిల్ అజీమి అయ్ యష్ఫియక'** **أَسْأَلُ اللهَ الْعَظِيْمَ رَبَّ الْعَرْشِ الْعَظِيْمِ أَنْ يَّشْفِيَكَ.**

(నేను స్వస్థత చేకూర్చమనీ మహోన్నత సింహాసనానికి సర్వోన్నతుడైన అల్లాహ్‌ను ఆర్థిస్తున్నాను).

అని చదివినట్లయితే (ఆ వ్యాధి) అతనికి మరణం కాకపోతే, అల్లాహ్ అతనికి ఆ వ్యాధి నుండి స్వస్థత చేకూర్చుతాడు''

(అబూదావూద్, తిర్మిజీ, ఇబ్ను హిబ్బాన్, హాకిమ్).

ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''మరణం పొందాలని ఆశించకండి. ఒక వేళ మీరు పుణ్యాత్ములుగా ఉంటే మరింత అధికంగా పుణ్యకార్యాలు చేయువచ్చు. ఒక వేళ పాపాత్ములుగా ఉంటే పశ్చాతాపం చెంది అల్లాహ్ వద్ద క్షమాపణ కోరి ప్రేమను పొందవచ్చు'' (బుఖారీ).

ప్రవక్త ముహమ్మద్ﷺ ఒక పల్లెవాసిని పరామర్శించి ఇలా పఠించారు:

**'లా బాస తహూరున్ ఇన్షా అల్లాహ్'** **لاَ بَأْسَ طَهُورٌ إِنْ شَاءَ اللَّهُ.**

(మీరేమి చింతించకండి. అల్లాహ్ అనుగ్రహిస్తే ఈ వ్యాధి (మిమ్మల్ని పాపాల నుండి) ప్రక్షాళనం చేస్తుంది (బుఖారీ).

హజ్రత్ ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ؓ ఒక సారి తనకు ఒంట్లో నొప్పిగా ఉందని ప్రవక్త ముహమ్మద్ﷺగారికి చేప్పారు. దానికి ప్రవక్త ముహమ్మద్ﷺ నొప్పిగా ఉన్నచోట చెయ్యిపెట్టి మూడుసార్లు **'బిస్మిల్లాహ్'** అని, ఏడు సార్లు:

| | |
|---|---|
| 'అవూజు బిఇజ్జ తిల్లాహి వ ఖుద్‌రతిహి మిన్ షర్రి మా అజిదు వ ఉహాజిరు' | أَعُوْذُ بعِزَّةِ اللهِ وَ قُدْرَتِه مِنْ شَرِّ مَا أَجِدُ وَ أَحَاذِرُ |

అని పఠించమని ఉపదేశించారు. (ముస్లిం)

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ رضي الله عنه కథనం; అల్లాహ్ దూత జిబ్రయీల్ عليه السلام ప్రవక్త ముహమ్మద్ ﷺ దగ్గరకు వచ్చి ''ఓ ముహమ్మద్ ﷺ మీరు అనారోగ్యంగా ఉన్నారా?అని పరామర్శించారు. దానికి ప్రవక్త ముహమ్మద్ ﷺ అవునన్నారు. అప్పుడు జిబ్రయీల్ عليه السلام ఆయన కోసం ఈ విధంగా ప్రార్థించారు:

| | |
|---|---|
| 'బిస్మిల్లాహి అర్‌ఖీక మిన్ కుల్లి షైయిన్ యూజీక, మిన్ షర్రి కుల్లి నఫ్సిన్ అవ్ ఐనిన్ హాసిదిన్ అల్లాహు యష్ఫీక, బిస్మిల్లాహి అర్‌ఖీక' | بِسْمِ اللَّهِ أَرْقِيكَ مِنْ كُلِّ شَيْءٍ يُؤْذِيكَ مِنْ شَرِّ كُلِّ نَفْسٍ أوْعَيْنٍ حَاسد اَللَّهُ يَشْفِيكَ بِسْمِ اللَّهِ أَرْقِيكَ. |

(అల్లాహ్ పేరుతో మీపై ఊదుతున్నాను. అన్ని రకాల బాధల నుండి, ప్రతి ప్రాణి కీడు నుండి, అసూయాపరుని దృష్టి నుండి, అల్లాహ్ మీకు ఉపశమనాన్ని ప్రసాదించుగాక!అల్లాహ్ పేరుతోనే మీపై ఊదుతున్నాను) (ముస్లిం).

**మరణం సమీపించిన వారికి కలిమా పఠించమని ప్రోత్సాహించాలి.**

హజ్రత్ ముఆజ్ رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: తన జీవితపు తుది పలుకు **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అయిన వ్యక్తి స్వర్గానికి వెళ్తాడు. (అబూదావూద్:3116, హాకిమ్)

ఎవరైనా ఆప్తమిత్రులు చనిపోతే వారి నుదుటిని ముద్దుపెట్టవచ్చు. ఎందుకంటే హజ్రత్ అబూబకర్ رضي الله عنه గారు ముహమ్మద్ ﷺ మరణించినప్పుడు ఆయన నుదుటిపై ముద్దు పెట్టారు. (బుఖారీ)

# మృతునికి అంత్యక్రియలు జరిపే ఘనత

హజ్రత్ అబూ హురైరా رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ఎవరయిన మృతుని అంత్యక్రియల్లో పాల్గొని నమాజ్ ముగిసేవరకు జనాజా వెంట ఉంటే, అతనికి ఒక **ఖీరాతు పుణ్యం** లభిస్తుంది. ఎవరయినా ఖనన సంస్కారాలు ముగిసేవరకూ జనాజా వెంట ఉంటే, అతనికి రెండు **ఖీరాతుల పుణ్యం** లభిస్తుంది. **'రెండు ఖీరాతు లంటే ఎంత?'** అని ఎవరో అడగ్గా, దానికి ప్రవక్త ముహమ్మద్ ﷺ **'రెండు పర్వతాల అంత'** అని సమాధానమిచ్చారు'' (బుఖారీ, ముస్లిం).

హజ్రత్ అబూ రాఫే అస్లమ్ رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ఎవరైతే మృతునికి స్నానం చేయించి, అతని లోపాలును బహిర్గితం చెయ్యకుండా ఉంటే, నలభై సార్లు అల్లాహ్ వారిని క్షమిస్తాడు.

మరియు ఎవరైతే గోరిని త్రవ్వి దానిలో ఖననం చేస్తాడో, అతనికి ప్రళయం వరకూ ఒక గృహంలో ఆశ్రయమిచ్చినంత పుణ్యం లభ్యమవుతుంది.

మరియు ఎవరైతే శవ వస్త్రాలను తొడిగిస్తాడో, అతనికి ప్రళయ దినాన అల్లాహ్ సుతిమెత్తని మరియు దళసరి పట్టు వస్త్రాలను తొడగిస్తాడు''

(హాకిమ్, బైహఖి, అహ్కాముల్ జనాయిజ్ లిల్ అల్బాని: 30)

మృతుని భౌతికకాయానికి శారీరక లోపాలేమయినఉన్నా స్నానం చేయించే టప్పుడు వారికి కనబడితే, లేదా మరణంవల్ల అతని రూపురేఖల్లో ఏమయినా మార్పులు ఏర్పడితే వాటిని ఇతరుల ముందు బయటపెట్ట రాదు.

# శవం కనురెప్పలు మూసేటప్పుడు ప్రార్థన

ప్రవక్త ముహమ్మద్ﷺ హ్రజత్ అబూ సల్మా(రజి) (మరణవార్త విని ఆయన) ఇంటికి వచ్చారు. అప్పటికి అబూసల్మా(రజి) కళ్ళు బిగుసుకు పోయాయి. ప్రవక్త ముహమ్మద్ﷺ ఆయన కనురెప్పలు మూసి,''ప్రాణం పోయేటప్పుడు కళ్ళు దాన్ని వెంబడిస్తాయి'' అని అన్నారు. ఆ మాట వినగానే అబూ సల్మా(రజి) ఇంటివారు గొల్లుమన్నారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ﷺ (వారిని సముదాయిస్తూ) ''మీరు చెప్పే మాటలకు అల్లాహ్ దూతలు 'ఆమీన్' అని అంటుంటారు. కనుక మీ మృతుల విషయంలో మంచి మాటలే పలకండి'' అని అన్నారు. తర్వాత ఆయన అబూ సల్మా(రజి) కొరకు ఈ విధంగా ప్రార్థించారు:

| | |
|---|---|
| **అల్లాహుమ్మగ్ ఫిర్ ... వర్ఫా దరజతహు ఫిల్ మహ్‌దియ్యీన, వఖ్‌లుఫ్‌హు ఫీ అఖిబిహి ఫిల్ గాబిరీన, వగ్‌ఫిర్ లనా వలహూ, యా రబ్బల్ ఆలమీన.** | **اللَّهُمَّ اغْفِرْ ...وَارْفَعْ دَرَجَتَهُ فِي الْمَهْدِيِّينَ، وَاخْلُفْهُ فِي عَقبه فِي الْغَابِرِينَ وَاغْفِرْ لَنَا وَلَهُ يَا رَبَّ الْعَالَمِينَ .** |
| **అల్లాహుమ్మఫ్ సహ్ లహూ ఫీ ఖబ్‌రిహి, వ నవ్విర్ లహు ఫీహి.** | **اللَّهُمَّ افْسَحْ لَهُ فِي قَبْرِهِ ، وَنَوِّرْ لَهُ فِيهِ.** |

ఓ అల్లాహ్! (అని మరణించిన వారి పేరు చెప్పి) ఫలానవారిని క్షమించు. మోక్ష మార్గాల్లో అతని స్థానాన్ని పెంచు. అతనిపై ఆధారపడిన వారికి నీవే సంరక్షకుడివి. ఓ సకలలోకాలకు ప్రభువా! మమ్మల్ని, అతన్ని క్షమించు. అతని కొరకై అతని సమాధిని విశాలవంతం, ప్రకాశ వంతంగా చేయుము.

(ముస్లిం)

# మృతునికి స్నాన సంస్కారం

హజ్రత్ ఉమ్మె అతియా رضي الله عنها కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఒక కుమార్తె చనిపోయినపుడు ఆయన మా దగ్గరికి వచ్చి ఇలా చెప్పారు: ‘‘ఆమె (స్నానం కొరకు) నీటిలో రేగాకులు వేసి మూడు లేక అయిదు సార్లు లేదా అవసరమనుకుంటే అంతకంటే ఎక్కువ సార్లు స్నానం చేయించండి. చివరి సారి కర్పూరం కలపాలి’’ లేక ‘కొంచెం కర్పూరం కలపాలి’ ఆ తరువాత ‘స్నానం చేయించాక నాకు కబురు చేయండి’ అని ఆయన అన్నారు.

మేము (శవానికి స్నానం చేయించి) ఆయనకు కబురు చేసాము. ఆయన (వచ్చి) మాకు తన లుంగీ ఇస్తూ, ‘ఈ వస్త్రాన్ని ఆమె దేహానికి తాకే విధంగా చుట్టండి’ అని చెప్పారు. (బఖారీ)

మరియు హజ్రత్ హఫ్సా رضي الله عنها హదీసు ప్రకారం: ‘ఆమెను బేసి సంఖ్యలో స్నానం చేయించండి’ అని ప్రవక్త ముహమ్మద్ ﷺ అన్నారు. ఉమ్మె అతియా رضي الله عنها హదీసు ప్రకారం: ‘ఆయన మూడు లేక అయిదు లేక ఏడు సార్లు స్నానం చేయించండి’ అని అన్నారు. అదీగాక ‘కుడివైపు నుండి ప్రారంభించండి. మొదట వుజూ చేయవలసిన అవయవాలను కడగండి’ అని ప్రవక్త ముహమ్మద్ ﷺ చెప్పినట్లు కూడా ఈ హదీసులో ఉంది. పోతే హజ్రత్ ఉమ్మె అతియా తాము ఆమె శిరోజాలు దువ్వి వాటిని మూడు పాయలుగా చేసామని (జడలుగా అల్లామని) కూడా తెలిపారు.

(బుఖారీ, ముస్లిం).

ప్రవక్త ముహమ్మద్ ﷺ హజ్రత్ ఆయిషా رضي الله عنها గారితో: ‘‘....ఒక వేళ నాకంటే ముందు నీకు మరణం జరిగితే: **‘నేను నీకు స్నాన సంస్కారం, వస్త్రా**

**సంస్కారం జరుపుతాను.** తరువాత జనాజా నమాజు చేస్తాను. మరియు నీ ఖనన సంస్కారం జరుపుతాను'' అని అన్నారు. (ఇబ్నుమాజా:1465)

స్త్రీలకు స్త్రీలు మాత్రమే, పురుషులకు పురుషులు మాత్రమే శవస్నానం జరపాలి. **కాని భర్త భార్యకు, భార్య భర్తకు శవ స్నానం జరపవచ్చును.** (అబూదావూద్: 3143) అలాగే ఏడు సంవత్సరాలకు లోపు ఉన్న పాపకు లేక బాబుకు స్త్రీలు లేక పురుషులు స్నానం జరపవచ్చును.

హ్రజత్ అలీ رضي الله عنه కథనం ప్రకారం: ప్రవక్త ముహమ్మద్ ﷺ గారికి; 'నేను స్నానం చేయించాను. అప్పుడు ఆయన కడుపులో (మలమూత్రం) 'శవానికి ఉన్నట్లు' ఏమైన ఉన్నదా అని చూసాను. కాని అలాంటిదేమి కనపడలేదు. ఎందుకంటే ఆయన బ్రతికుండినా, మరణించినా ఎంతో పరిశుద్ధులు. (హాకిమ్, బైహఖీ, కతాబుల్ జనాయిజ్ లిల్ అల్బానీ: 100)

హ్రజత్ అబూ హురైరా رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ఎవరైతే శవాన్ని స్నానం చేయించాడో, అతను కూడా స్నానం చేసుకోవాలి. మరియు ఎవరైతే శవపేటికను ఎత్తుకొని పోయాడో, అతను వుజూ చేసుకోవాలి''✽ (అబూదావూద్: 3163).

---

✽మనిషి మరణించిన వెంటనే అతని కళ్ళు, నోరు తెరుచుకొని ఉంటే మూసివేయాలి. కాళ్ళను, చేతులను, అతని శరీరాన్ని సక్కగా చేసి, అతను తొడిగిన బట్టలను తొలిగించి, అతనిపై ఒక చాదరు కప్పండి. శవం శరీరంలో ఆభరణాలు, తాయిత్తులు లేక ఇతర మూఢ విశ్వాస దారాలు ఉంటే తొలగించండి.

స్నానం కొరకై నీళ్ళలో రేగు ఆకులు కలిపి వేడి చేసుకోవాలి. స్నానం చేయించే స్థలం నలువైపుల నుండి తెర(పరదా) ఉండాలి. మరియు పైన కప్పు కూడా ఉంటే ఇంకా మంచిది. తరువాత ఆ శవాన్ని ఒక పాలము

(బల్ల)పై పండబెట్టి స్నానం జరపాలి. ఆ పాలము యొక్క తల భాగము కొంచెం ఎత్తుగా ఉండాలి. ఎందుకంటే అతన్ని కొంచెం పైకిలేపి కడపులో ఉన్న మలమూత్రం శుభ్రం చేయుటకు అనుకూలమవుతుంది.

స్నానం చేయించేవారు తమ ఎడమ చేతికి ఒక శుభ్రమైన గుడ్డపేలిక చుట్టుకొని ఆ చేత్తో **చక్కగా రుద్దుతూ స్నానం చేయించాలి.** స్నానం జరుపుటకు ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తుల సహాయం తీసుకోవచ్చును.

శవం మోకాళ్ళ నుండి నాభి వరకు ఒక చాదరు కప్పి స్నానం జరపాలి. మర్మంగాలపై చూపు వాలకుండా జాగ్రత్త పడాలి.

ఒక వ్యక్తి శవానికి గాయాలు లేక ఇతర కట్లు ఉంటే జాగ్రత్తగా వాటిపై మసహ్ చేయాలి. వాటిని విప్పి తిరిగి కట్టడంలో ఎలాంటి బాధ లేదనుకుంటే, దూదితో వాటిని శుభ్రం చేసి తిరిగి కట్లు కట్టాలి. అలా చేయలేని స్థితిలో కట్లు విప్పే ప్రయత్నం చేయకూడదు.

ఒక వేళ శవం కాలిపోయినట్లయితే లేక అతని అవయవాలు తునకలు తునకలుగా ఉన్నట్లయితే స్నానం జరిపే స్థితిలో లేనప్పుడు **తయమ్ముమ్ జరపాలి.**

శవం కడుపు మీద చేయి వుంచి నడుము వరకు మెల్లగా లేవనెత్తాలి. తరువాత కడపులో ఉన్న మలమూత్రం శుభ్రం చేయుటకు కడుపును మెల్లగా అదమాలి. వెలికి వచ్చిన మల మూత్రాన్ని నీళ్ళు పోసి ఎడమ చేతితో శుభ్రం చేయాలి. ఇలా రెండు మూడు సార్లు చేస్తే కడుపులో ఉన్న మలమూత్రం వెలికి వచ్చేస్తుంది. ఆ తరువాత ముక్కు, నోరు మరియు చెవులను వీలైనంత శుభ్రం చేయాలి.

# మృతునికి వస్త్ర సంస్కారం.

హజ్రత్ ఆయిషా ؓ కథనం:- ప్రవక్త ముహమ్మద్ ﷺ (భౌతికకాయం)కు యమన్ దేశంలోని సహూల్ ప్రాంతంలో తయారయిన మూడు తెల్లటి వస్త్రాలలో చుట్టడం జరిగింది. ఆయన (భౌతికకాయం)కు చుట్టిన వస్త్రాలలో చొక్కాగాని, తలపాగా గాని లేవు.❁ (బుఖారీ)

---

తరువాత **'బిస్మిల్లాహ్'** పఠించి తల మసహ్ మరియు కాళ్ళను మినహా నమాజు కొరకై ఎలా వుజూ చేస్తామో అలా వుజూ చేయించాలి. ప్రతి అవయవాన్ని కుడివైపు నుండి కడగటం ప్రారంభించాలి.

తరువాత సబ్బుతో రుద్ది పూర్తి శరీరాన్ని మూడు సార్లు లేక అయిదు సార్లు నీళ్ళుపోసి స్నానం చేయించాలి. చివరిసారి నీళ్ళు పోసేటప్పుడు ఆ నీళ్ళలో కర్పూరం కలుపుకోవాలి. తరువాత తల మసహ్ చేసి, కాళ్ళను కడగాలి. తరువాత శవాన్ని శుభ్రమైన గుడ్డతో తుడవాలి. ఆ తరువాత శవ వస్త్రాలు ధరింపజేయాలి.

**గమనిక:** కొంత మంది గురువులు స్నానం ప్రారంభించిన తరువాత అనేక రకాల దుఆ పదాలు పఠిస్తూ స్నానం చేయిస్తారు. ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా దుఆలు పఠించినట్లు, లేక దుఆలు పఠించమని ఆదేశించినట్లు ఆధారాలు లేవు. అలాంటి పదాలు చదవకపోవడమే అభిలషణీయం.

❁**చాలా మంది ధర్మగురువుల అభిప్రాయం ప్రకారం:** 'స్త్రీల భౌతిక కాయానికి మూడు వస్త్రాలతో పాటు, ఇంకా రెండు వస్త్రాలు వాడుతారు. అంటే తలపై మరియు రొమ్ముపై కప్పుటకు వాడుతారు.

స్త్రీల భౌతికకాయానికి ఐదు లేక పురుషుల భౌతికకాయానికి మూడు వస్త్రాలు లభించకపోతే, ఒక్క వస్త్రంలోనే చుట్టి ఖననం చేయవచ్చును. అవి కూడా లభ్యం కాకపోతే, అతను ధరించే శుభ్రమైన వస్త్రాలలో చుట్టి ఖననం చేయవచ్చును.

ఆ తరువాత శవంపై లేక శవ పేటికపై ఒక దుప్పటి కప్పాలి:

ప్రవక్త ముహమ్మద్ﷺ ఆయన భౌతికకాయంపై యమన్‌లో తయారయిన ఒక ఆకుపచ్చని దుప్పటి కప్పారు. (బుఖారీ)

శవ వస్త్రాలపై **ఖుర్ఆన్ ఆయతులు లేక కలిమయే షహాదత్** వంటి పదాలు వ్రాయకూడదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ﷺ లేక సహాబాల వస్త్రాలపై ఇలా వ్రాసినట్లు ఆధారాలు లేవు. పైగా ఇది **ఒక బిద్అత్** ఆచారం.

## శ్మశానానికి ఎత్తుకొని పోయే సంస్కారం.

శవాన్ని శవపేటికలో ముందు కాళ్ళభగాన్ని వంచుతూ తల భాగాన్ని దించి పెట్టాలి. తరువాత శవపేటికను తలవైపు నుండి ఎత్తుకొని నడవాలి. ప్రజలందరు శవ పేటిక కాళ్ళవైపున నడుచుకుంటూ పోవాలి. శవ పేటిక తీసుకొని పోయేటప్పుడు కూర్చున్నవారు నిలబడాలి. శవయాత్ర వెళ్ళిపోయిన తరువాత కూర్చోవచ్చును. అలాగే సవారిపై ఉంటే సవారి మీదనుండి దిగి నడిచి పోవాలి. లేదా శవయాత్ర వెనుక చిట్టచివరిగా సవారిపై పోవచ్చును. స్త్రీలు శవపేటిక వెంట (శ్మశానానికి) వెళ్ళడం నిషిద్ధం.

శవపేటికను తీసుకొపోయేటప్పుడు దాని వెనుక నడవడమే ఉత్తమం. కాని నలువైపుల నుండి కూడా నడిచిపోవచ్చును. కనుక ఒక హదీసులో ఇలా ఉంది: ‘‘సవారి చేసే వ్యక్తి శవానికి వెనుక ఉండాలి. నడిచేవారు శవపేటిక దగ్గర నుంచి ముందు లేక వెనుక కుడివైపు లేక ఎడమవైపు నుండి నడిచిపోవచ్చును’’

(అబూదావూద్:3180, అహ్కాముల్ జనాయిజ్ లిల్ అల్బానీ: 50).

ప్రవక్త ముహమ్మద్ﷺ శవపేటికతో నడుస్తుండగా ఆయన వద్దకు సవారి చెయ్యమని ఒక జంతువును తీసుకురావడం జరిగింది. దానిపై సవారి చేయుటకు ఆయన నిరాకరించారు. (ఖననం పూర్తి చేసుకున్న తరువాత) తిరిగి వచ్చేటప్పుడు (మరలా) జంతువును తీసుకొరావడం జరిగింది. అప్పుడు ఆయన దానిపై సవారి చేసారు. కొంత మంది దీని గురించి అడిగారు. దానికి ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ దూతలు (శవ పేటికతో) నడుస్తున్నారు. వారు నడుస్తుండగా నేను ఎలా సవారిపై ఎక్కి వచ్చేది! వారు వెళ్ళిపోయిన తరువాత నేను సవారిపై ఎక్కినాను'' (అబూదావూద్:3179, అహ్కాముల్ జనాయిజ్ లిల్ అల్బానీ: 52).

అంటే శవ పేటిక వెంట పోయేటప్పుడు నడిచి వెళ్ళడం గొప్ప ఆచారం. తిరిగి వచ్చేటప్పుడు నడిచి రావచ్చును లేక వాహనంపై కూడా రావచ్చును.

ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ఆదేశించారు: ''మీరు శవయాత్ర వస్తుండగా చూస్తే నిలబడండి. అది ముందుకు వెళ్ళిపోయే వరకు అలాగే నిలబడండి.

(బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఉమ్మె అతియా رضي الله عنها కథనం; ''మమ్మల్ని (స్త్రీలను) జనాజాల (శవపేటికల) వెంట (శ్మశానానికి) వెళ్ళకుండా వారించటం జరిగేది. అయితే ఈ విషయంలో మరీ అంత తీవ్రవైఖరి అవలంభించేవారు కాదు''

(బుఖారీ).

జనాజా మోసుకుని వెళ్ళేటపప్పుడు **ఖుర్‌ఆన్ పఠనం** లేక **కలియయే షహాదత్** పఠించడం ధర్మ ఆచారం కాదు. అని ధర్మ గురువులందరు ఏకీభవించారు. (మజ్మూఅల్ ఫతావా:24/293) ❁

## ఇతరులు రోధించడం వలన మృతుడు శిక్షింపబడుతాడు.

హజ్రత్ ఇబ్ను ఉమర్ؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''చనిపోయినవాని గురించి రోదించేవారి కారణంగా సమాధిలో యాతనకు గురిచేయటం జరుగుతుంది'' (బుఖారీ ముస్లిం).

హజ్రత్ ఇబ్ను ఉమర్ؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''మృతుడు తన సమాధిలో శిక్షకు గురికాబడుతాడు. అతని కోసం (బంధువులు) రోదించడం వలన'' (ముస్లిం).

**ముఖ్య గమనిక:** బంధువుల్లో ఎవరైనా మరణిస్తే ప్రళయాన్ని సృష్టించేలా గొడవచేయటం, పెడబొబ్బలు పెట్టటం, బట్టలు చించుకోవటం, రొమ్ముపై బాదుకోవటం, జడలు విప్పి తాండవమాడటం నిషిద్ధం. బంధువులు చనిపోయినప్పుడు ఏడుపు రావటం సహజం. కాని– బిగ్గరగా – ఏడవటం

---

❁శవాన్ని శశ్మానానికి తీసుకుపోయేటప్పుడు **ఫాతిహాలు** పఠిస్తారు. మరియు గోధుములు, ఉప్పు శ్మశానానికి తీసుకుపోతారు. లేక ఇంటి వద్ద దాన్ని సదఖాగా పంచిపెట్టే ఆచారాలు నిర్వహిస్తారు. అలాంటి కార్యాలకు ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా ఆధారాలు లేవు. ముహమ్మద్ﷺ మరియు ఆయన సహబాలు కూడా ఇలా చేసేవారు కారు. మరియు ఇలాంటి అధర్మమైన కార్యాలను మానుకోవడంలో అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ﷺ ప్రేమ పొందగలిగే అవకాశముంది.

మాత్రం ధర్మ సమ్మతం కాదు. శోకంతో కళ్లగుండా కన్నీరు రావటం కూడా సహజమే. ముహమ్మద్ﷺ కుమారుడు హజ్రత్ ఇబ్రహీం رضي الله عنه చనిపోయిన సందర్భంగా ఆయన కళ్లల్లో నుంచి కన్నీరు ప్రవహించ సాగింది. ప్రవక్త ముహమ్మద్ﷺ తమరు కూడా 'ఏడుస్తున్నారా?'' అని హజ్రత్ అబ్దుర్ రహ్మాన్ బిన్ ఔఫ్ رضي الله عنه ఆశ్చర్యం వెలిబుచ్చాగా, 'ఇది అసహనంతో కూడిన ఏడుపు కాదు సుమా! అనురాగంతో, వాత్సల్యంతో ఉబికివస్తున్న కన్నీళ్లు మాత్రమే'' అని ఆయన సమాధానమిచ్చారు'' (బుఖారీ).

## మరణించిన వ్యక్తి ఇంటికి పోయి చేసేదుఆ

**إنَّ لله مَا أَخذَ ولَهُ مَا أَعْطَى وكُلُّ شَيءٍ عِنْـدَهُ بأَجَـلٍ مُسَمًّى فَلْتَصْبِرْ وَلْتَحْتَسِبْ.**

**'ఇన్నా లిల్లాహి మా అఖజ వ లహు మా ఆ'తా వ కుల్లు షైయిన్ ఇన్‌దహు బి అజలిమ్ ముసమ్మ, ఫల్ తస్బిర్ , వల్ తహ్‌తసిబ్'.**

(నిశ్చయంగా అల్లాహ్ వెనక్కి తీసుకుంది ఆయనదే, తాను ప్రసాదించినది ఆయనదే, ప్రతి వస్తుకూ ఆయన ఒక గడువు నిర్ణయించి ఉన్నాడు. కనుక మీరు ఓర్పు పుణ్య ఫలపేక్షతో ఉండండి) (బుఖారీ, ముస్లిం).

# ఖనన సంస్కారం.

హజ్రత్ అబూ హురైరా رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''మృతదేహాన్ని (శ్మశానానికి) తీసుకెళ్ళడంలో తొందర చేయండి. ఎందుకంటే మృతుడు పుణ్యాత్ముడయిఉంటే అతడ్ని మీరు సత్పర్యవసానం వైపుకు తీసుకెళ్తున్నారన్నమాట. ఒక వేళ అతను పాపాత్ముడయిఉంటే అతనొక చెడుమయం. దాన్ని మీరు భుజాలనుండి దించి వేయడానికి వెళ్తున్నారన్నమాట. (అందువల్ల మృతదేహాన్ని ఎంత త్వరగా శ్మశానానికి చేర్చితే అంత మంచిది). (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ رضي الله عنه కథనం ప్రకారం. **మేము మూడు సమయాలలో నమాజు చేయడాన్ని, మృతుని అంత్యక్రియలు జరపటాన్ని ప్రవక్త ముహమ్మద్ ﷺ వారించేవారు:**

**మొదటిది:** ''సూర్యోదయం అయ్యేవేళ. అది పైకెక్కేవరకూ.

**రెండవది:** నడినెత్తిమీదకొచ్చిన సూర్యుడు వాలేవారకూ.

**మూడవది:** సూర్యాస్తమయం అయ్యేవేళ. అది అస్తమించేవరకూ''

(ముస్లిం).

ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''గోరిని లోతుకు తవ్వండి, మరియు దాన్ని నున్నగా మరియు శుద్ధంగా ఉంచండి'' (తిర్మిజీ).

తరువాత శవాన్ని కాళ్ళ వైపు నుండి సమాధిలోకి దింపాలి.

(అబూదావూద్, బైహఖి).

**శవాన్ని గోరిలో దింపేటప్పుడు** ఇలా చదవాలి. بِسْمِ اللّٰهِ وَعَلَى مِلَّةِ رَسُولِ اللّٰهِ

**'బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహి'** (అబూదావూద్, హాకిమ్).

సమాధిలో మృతునిని తన కుడి భుజంపై పండబెట్టి, ముఖం ఖిబ్లావైపుకు ఉన్నట్లు ఉంచాలి.

హజ్రత్ సఅద్ బిన్ అబూవఖ్ఖాస్ ఇలా ఆదేశించారు: (నేను చనిపోయిన తరువాత) 'నా కోసం సమాధిలో చంక **(లహద్)** మాదిరిగా ప్రక్కనుంచి జాగా తీయండి. మరియు పచ్చి ఇటుకలు సున్నం పర్చండి. ఎలాగైతే ప్రవక్త ముహమ్మద్ ﷺ గారి (సమాధి)కి చేయబడిందో' అని అన్నారు. (ముస్లిం).

## లహద్ సమాధి అంటే?

**(బగ్లీ సమాధి)** సమాధి లోపల కుడివైపు డొక్క మాదిరిగా చంక తరహాలో గోరిని త్రవ్వటం. తరువాత ఆ చంకలా ఉండే గుంతలో శవాన్ని ఉంచి, ఆ శవంపై మట్టి పడకుండా పచ్చి ఇటుకలు లేక నాప రాళ్ళను వంకరగా పేర్చే పద్ధతిని **లహద్ సమాధి** అంటారు. ప్రవక్త ముహమ్మద్ ﷺ గారికి ఈ విధానం అతి ఇష్టమైనది. అలాగే ఆయన కొరకు **లహద్ గోరి** (బగ్లీ సమాధి) త్రవ్వటం జరిగింది.

## షఖ్ సమాధి అంటే?

**(సందోఖి(పెట్టి లాంటి) సమాధి)** సమాధిలో **బగ్లీ** తీయకుండా సాధారణంగా గుంత త్రవ్వుతారు. ఈ విధానం కూడా అనుమతించబడింది.

సమాధి త్రవ్వేటప్పుడు ఒక వేళ ఇతర శవాల ఎముకలు వెలువడితే వాటిని తెంపడంగాని లేక విరగ్గొట్టడంగాని చేయకూడదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ఒక బ్రతికున్న మనిషి ఎముకను విరగ్గొట్టడం ఎంత పాపమో ఒక మృతుని ఎముకను విరగ్గొట్టడం కూడా అంతే పాపం'' (అబూదావూద్, ఇబ్నుమాజా).

కొంత మంది ప్రజలు శ్మశానం నుండి బయటకు వచ్చి లేక సమాధి దగ్గర నుండి నలభై అడుగుల దూరంగా వచ్చి దుఆ లేక ఫతెహాలు చేస్తారు. అలా చేయడం ప్రవక్త ముహమ్మద్ﷺ పద్ధతి కాదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ﷺ ఆదేశం మేరకు ఖనన సంస్కారం. జరిగిన తరువాత సమాధి దగ్గర నిలబడి దుఆ చేయమనీ ఆదేశించారు.

హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్రజి కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ మృతుని ఖనన సంస్కారాలు ముగిసిన తరువాత అతని సమాధి దగ్గర నిలబడి 'మీ సోదరుని మన్నింపు కోసం ప్రార్థించండి. ఇప్పుడతన్ని విచారించటం జరుగుతుంది. కనుక మీరు అతనికి (విశ్వాస) స్థిరత్వం లభించాలని కోరుకోండి' అని ఆదేశించేవారు. ✲(అబూదావూద్: 3211)

సమాధి వద్ద **ఫాతిహాలు, ఖుర్ఆన్ లేక సూరయే యాసీన్** చదవడం ధర్మ పద్ధతి కాదు. ఇలాంటి ఆచారాలు ప్రవక్త ముహమ్మద్ﷺ అనుచరులు ఎన్నడూ చేయలేదు. **అలాంటి పనులు మనం చేస్తే బిద్అత్ ఆచారాలుగా భావించ బడుతాయి.**

(జాదుల్ మఆద్:1/522-527, కితాబుల్ జనాయిజ్ లిల్ అల్బానీ:325).

---

✲సమాధి దగ్గర నిలబడి దుఆ చేయడం మాత్రమే ప్రవక్త ముహమ్మద్ﷺ ఆదేశం. అంటే ప్రతి ఒక్కరు మృతుని కొరకు దుఆ చేయడం ధర్మ పద్ధతి. గురువుగారు దుఆ చేస్తూవుంటే ఇతరులు సామూహికంగా ఆమీన్ చెప్పడం కూడా ధర్మం కాదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ﷺ అక్కడ ఉన్నవారిని దుఆ చేయమని ఆదేశించారు. కాని కలిసి దుఆ చేస్దామనీ అనలేదు.

# సమాధుల నిర్మాణం

ప్రవక్త ముహమ్మద్ﷺ 'సమాధి ఒంటె గోపురంలా చేయబడ్డది' (బుఖారీ). మరియు ఆ సమాధి ఎత్తు నేలకు **ఒక జేనెడు** మాత్రమే ఉంచబడింది. (బైహఖీ).

హజ్రత్ జాబిర్ؓ ఉల్లేఖనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ﷺ: ''సమాధిని పటిష్టవంతం చేయడాన్ని, దానిపై కూర్చోవటాన్ని, దానిపై కట్టడం నిర్మించడాన్ని నిషేధించారు'' (ముస్లిం).

హజ్రత్ అలీؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ: నాతో ఇలా అన్నారు: ''ప్రతి విగ్రహాన్ని (ఫోటును) పగలగొట్టు మరియు ప్రతి ఎత్తుగా ఉన్న సమాధిని (నేలకు) సమానంగా చెయ్యి'' (ముస్లిం).

ప్రవక్త ముహమ్మద్ﷺ సమాధులపై (పేర్లను లేక ఇతర వాక్యాలను) ముద్రించటాన్ని నిషేధించారు. (అబూదావూద్:3225, హాకిమ్:1/370)

సమాధిని పక్కాగా నిర్మించటం ఒక వృధా ప్రయాస మాత్రమే. దానివల్ల మరణించిన వారికి ఎలాంటి ప్రయోజనం దక్కదు. అదీగాక సమాధిని ఆ విధంగా గౌరవించటం, ఆరాధించడం ఒక ముస్లింని షిర్క్ వైపుకు గొనిపోతుంది. సమాధుల మీద గుంబద్‌లు, గోపురాలు నిర్మించటం కూడా అలాంటిదే. పోతే సమాధుల మీద కూర్చోవటం వాటిలో ఉండే మనుషుల గౌరవానికి విరుద్ధం.

అలాగే కొందరు శవపేటికపై పూలతో అలంకరిస్తారు. ఇంకా సమాధిపై కూడా పూలు వేస్తారు. ఇలా పూలు వేయడం ప్రవక్త ముహమ్మద్ﷺ పద్ధతి కాదు. ఇలాంటి ఆచారాలకు దూరంగా ఉండటమే ఉత్తమమైన ధర్మ పద్ధతి.

# సమాధుల సందర్శనం

ప్రవక్త ముహమ్మద్ﷺ శ్మశానానికి సందర్శిస్తే ఇలా చదివేవారు:

السَّلَامُ عَلَى أَهْلِ الدِّيَارِ مِنَ الْمُؤْمِنِينَ وَالْمُسْلِمِينَ وَ يَرْحَمُ اللَّهُ الْمُسْتَقْدِمِينَ مِنَّا وَالْمُسْتَأْخِرِينَ وَإِنَّا إِنْ شَاءَ اللَّهُ بِكُمْ لَاحِقُونَ.

‘‘అస్సలాము అలా అహ్‌లిద్ దియారి మినల్ మూమినీన, వల్ ముస్లిమీన, వ యర్‌హముల్లా హుల్ ముస్‌తఖ్‌దిమీన మిన్నా వల్ ముస్‌తఅ్ ఖిరీన, వ ఇన్నా ఇన్‌షా అల్లాహు బికుమ్ లాహిఖూన’’

(ఓ ఈ గృహవాసులైన విశ్వాసులారా! ముస్లిములారా! మీపై శాంతి కలుగుగాక, మరియు మాకంటే ముందుగా పోయినవారిని, మా తరువాత పోయేవారిని అల్లాహ్ కరుణించుగాక. అల్లాహ్ చిత్తమైతే మేము కూడా మీతో (దగ్గరలోనే) కలుస్తాము) (ముస్లిం).

ప్రవక్త ముహమ్మద్ﷺ **సమాధులపై కూర్చునేవారి మరియు వాటిమీద నడిచేవారి గురించి హెచ్చరిస్తూ ఇలా అన్నారు:** ‘‘మీలో ఎవరైనా సమాధిపై కూర్చోవడం (నడవడం)కంటే, అగ్నిపై కూర్చొని అతని బట్టలు కాలిపోయి చర్మాన్ని అంటుకున్న మేలేననీ అనిపిస్తుంది’’ (ముస్లిం, అబూదావూద్).

హజ్రత్ బురైద బిన్ హుసైబ్ؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ‘‘నేను మీకు సమాధులను సందర్శించరాదని చెప్పి ఉన్నాను. కాని ఇక నుంచి మీరు వాటిని సందర్శించండి (ఎందుకంటే) సమాధుల సందర్శనం పరలోకాన్ని జ్ఞప్తికి తెస్తుంది’’ (ముస్లిం, ఇబ్నుమాజా).

ఈ హదీసు ద్వారా ‘మనిషిలో పరలోక చింతనను కలిగించి, తనలో భయభక్తిని పెంపొందించి, మరియు చనిపోయినవారి మన్నింపుకై వేడుకోవటానికి ప్రవక్త ముహమ్మద్ﷺ అనుమతిని ప్రసాదించారనే

విషయం తెలుస్తుంది. వారి గురించి దుఆ చేయాలని ఖుర్ఆన్‌లో కూడా అల్లాహ్ ఇలా తెలియజేసాడు: వారి (చనిపోయిన) తరువాత వచ్చినవారు వారిలా వేడుకుంటారు:''మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేషభావాన్నీ కలిగించకు. మాప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కలిగినవాడవు, కనికరించేవాడవు''

(సూరతుల్ హష్ర్:10).

కాని కొంత మంది ప్రజలు సమాధుల సందర్శనం అంటే; సమాధుల వద్ద లేక దర్గాల వద్ద ఉరుసుల పేరుతో బాజా భజంత్రీలు, ఖవ్వాలి, ఇతర ఆటపాటలు చేయటానికి, మొక్కుకోవటానికి, మొరపెట్టుకోవటానికి, అర్పణాలు మరియు ఇతర అధర్మ ఆచారాలు చేయటానికి వెళ్ళు తుంటారు. ఇలాంటి ఉద్దేశ్యంతో మరియు ఆచారాలతో సందర్శించటం ఎంత మాత్రం ధర్మ పద్ధతి కాదు. అలా చేసేవారు అల్లాహ్‌తో క్షమాపణ కోరి తమ ఆచారాలను ప్రవక్త ముహమ్మద్ﷺ సున్నతులకు అనుగుణంగా సరిదిద్దుకోవాలి. లేదంటే పరలోకంలో నష్టపోతారు, విఫలులవుతారు.

దర్గాల నిర్మాణం మరియు వాటి సందర్శనం అక్కడ చేసే ఏ ఒక్క ఆచారానికి ఎలాంటి ఆధారాలు లేవు. **కస్మూర్ దర్గా, అజ్మీర్ దర్గా** మరియు **ఇతర దేశవిదేశాలలో ఉన్న దర్గాలకు ప్రయాణించడం అనేది నిషిద్ధం.** పైగా వాటిని ప్రత్యేకంగా సందర్శించే అనుమతి కూడా లేదు. ఎందుకంటే?

ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''మీరు మూడు మసీదులకు తప్ప మరేచోటుకు (ఆరాధన భావంతో) ప్రయాణం చేయకండి.

**ఒకటి; కాబతుల్లాహ్, రెండు; మస్జిదే నబవి, మూడు; మస్జిదే అఖ్సా, (బైతుల్ ముఖద్దస్)''** (బుఖారీ, ముస్లిం).

# వితంతువు

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేసాడు: ''మీలో ఎవరయినా మరణించి, వారు భార్యలను వదిలిపోతే అటువంటి స్త్రీలు నాలుగు మాసాల పది రోజుల వరకూ తమనుతాము గడువు(ఇద్దత్)లో ఆపుకోవాలి''

(సూరతుల్ బఖరా:234).

హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ ؓ గారి సోదరుడు మరణించారు. మూడు రోజుల తరువాత ఆమె పరిమళాన్ని తెప్పించి పూసుకున్నారు. తరువాత ఇలా ప్రవచించారు: **'నాకు పరిమళం అవసరమేమి లేదు'** కాని నేను ప్రవక్త ముహమ్మద్ ﷺ ప్రవచించిగా ఇలా విన్నాను: ''ఏ మహిళ అయితే అల్లాహ్‌ను, పరలోక దినాన్ని విశ్వసిస్తుందో, **ఆమె మూడు రోజులకంటే ఎక్కువగా శోకంలో ఉండటం నిషిద్ధం.** కాని తన భర్త శోకం గడవు నాలుగు నెలల పది రోజుల వరకు ఉంది'' (బుఖారీ).

వితంతువులు గర్భవతులై ఉంటే, వారి ఇద్దత్ (గడువు) ప్రసవం వరకు ఉంటుంది. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''గర్భిణీ స్త్రీల ఇద్దత్ వారి కాన్పు అయ్యే వరకు ఉంటుంది'' (సూరతు తలాఖ్:4)

గర్భిణీ స్త్రీలు ఎనిమిది నెలలు లేక ఎనిమిది రోజుల తరువాత కాన్పు జరిగినా, వారి ఇద్దత్ (గడవు) ప్రసవించిన వెంటనే పూర్తి అవుతుంది.

ఈ గడువు కాలంలో వితంతువు తన భర్త ఇంట్లోనే ఉండాలి. గడువు పూర్తి అయ్యేవరకు సింగారించుకోవటం,తలలో పూలు పెట్టుకోవటం, పరిమళాన్ని రాసుకోవటం, సుర్మా లేక కాటుక పెట్టుకోవటం వంటివి చేయకూడదు. అలాగే రంగురంగుల గాజులు చేతులలో ఉంటే వాటిని కూడా తొలగించాలి.

వితంతువు తన ఇద్దత్ పూర్తిగా గడిపిన తరువాత అలంకరించుకోవచ్చు. పెద్దలను సంప్రతించి పునర్వివాహం చేసుకోదలిస్తే లేక పెద్దలు వారి వివాహం చేయాలనుకుంటే వితంతువుల అంగీకారం తరువాత చేయడం గొప్పకార్యం.

కొంత మంది స్త్రీలు వితంతువు మెడలో ఉన్న నల్లపూసలను, చేతి గాజులను, కాళ్ళ మెట్టలను తెంపటం లేక తీయడం ఆచారంగా భావిస్తారు. పైగా నికాహ్ రోజు నల్లపూసల దండా స్త్రీ మెడలో వేయడం, కాలి వ్రేళ్ళలో మెట్టలు తొడగడం స్త్రీకి సుమంగళిగా కూడా భావిస్తారు. అందుకనే భర్త చనిపోగానే వాటిని తొలగిస్తారు. మరియు భర్త లేనివారు లేక పెళ్ళి కానివారు వాటిని ధరించరు. అటువంటి ఆచారాలకు ఇస్లాం ధర్మంలో ఎలాంటి ఆధారాలు లేవు, పైగా ఇది ఇతర ధర్మేతరుల ఆచారం.

ధర్మం తెలియని కొంత మంది ప్రజలు వారి బంధుమిత్రులలో ఎవరైనా మరణిస్తే ప్రతి ఒక్కరు నలభై రోజుల పాటు శోకాన్ని పాటిస్తారు. వారు సాధారణమైన (శాఖాహారం) భోజనం తింటారు. మాంసము మరియు బిరియాని వంటి భోజనం తమపై నిషేధించుకుంటారు. నలభై రోజుల వరకు తల వెంట్రుకలు మరియు గడ్డాలను పెంచుకుంటారు. క్రొత్త దుస్తులు ధరించరు. వారిలో వివాహం చేయవలసిన తేదీలు దగ్గరలో ఉన్నా నలభై రోజుల తరువాతే చేస్తామని వాయిదాలు వేస్తారు. ఇలా అనేక రకాలుగా ఇస్లాం ధర్మంలో లేని **ఆచారాలను జొప్పించి విధిగా** పాటిస్తారు. అలా చేయడం ఎంత మాత్రం ధర్మ సమ్మతం కాదు.

# మరణించిన తరువాత కూడా మనిషికి లభించే పుణ్యాలు

హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''మానవుడు చనిపోగానే అతని కర్మల పరంపర నిలిచిపోతుంది. కాని మూడు సత్కర్మలు మాత్రం ఎడతెగకుండా అతనికి చేరుతూ ఉంటాయి'' 1, మృతుని తరువాత కూడా ప్రజలకు ఉపయోగ పడుతూ ఉండే అతని దానధర్మాలు. 2, జనులకు లాభం చేకూర్చే అతని విద్య. 3, మృతుని కోసం ప్రార్థించే అతని సజ్జన సంతానం. (ముస్లిం)

పైన పేర్కొనబడిన మూడు విధానాల వలన మానవుడు మరణించిన తరువాత కూడా పుణ్యం లభిస్తూనే ఉంటుంది. వీటిని **'సదఖయే జారియా'** (శాశ్వత పుణ్యకార్యాలు) అని అంటారు. ఉదాహరణకు:

1, మృతుడు గనక తన జీవితంలో మస్జిద్‌లు, సత్రాలు, వైద్యశాలలు, పాఠశాలలు (వగైరా) నిర్మించి ఉంటే అవి నడుస్తున్నకాలం, ప్రజలు వాటి ద్వారా ప్రయోజనం పొందుతూ ఉన్నంత కాలం, మృతునికి దానివల్ల పుణ్యం లభిస్తూనే ఉంటుంది. కనుక మనిషికి మరణానంతరం పుణ్యప్రాప్తి జరగటానికి ఇదొక మార్గం.

2, ప్రజలకు ఉపయోగకరమైన విద్యను బోధించి చనిపోవటం, ఉదాహరణకు ఖుర్ఆన్ హదీసుల గ్రంధాలను క్రోడీకరించటం, మంచి పుస్తకాలు రచించటం, కూడా మనిషికి మరణానంతరం పుణ్యం లభిస్తుంది.

3, కన్నవారి శ్రేయస్సు కోసం ప్రార్థించే పుణ్యసంతానం మరణానంతరం మృతునికి లభించే పుణ్యానికి మూడో మార్గం. (హదీసు కిరణాలు:949)

హ|జత్ అబూ హురైరా رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''విశ్వాసి మరణించిన తరువాత అతను చేసిన కర్మలకు పుణ్యాలు ప్రాప్తమవుతానే ఉంటాయి. అవి; అతను విద్యను బోధించి మరియు దాన్ని విస్తృతం చేసింది. అతను వదలిపెట్టి పోయిన సజ్జన సంతానం. లేక వారసత్వంగా వదలిన ఖుర్ఆన్. లేక మస్జిద్ నిర్మాణం. లేక (బాటసారుల కొరకై) సత్రం నిర్మాణం. లేక అతను తన జీవితంలో ఆరోగ్యంగా ఉంటు తన ధనంలో నుండి చేసిన దానం. దాని పుణ్యం అతను చనిపోయిన తరువాత కూడా పొందుతూ ఉంటాడు''

(ఇబ్నుమాజా: 242, అహ్కాముల్ జనాయిజ్: 1/176).

హ|జత్ అనస్ బిన్ మాలిక్ رضي الله عنه కథనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ఏ ముస్లిమయితే మొక్కలను నాటితే, లేక వ్యవసాయం చేస్తే, దాని (ఆ పండిన పంటలో) నుండి పక్షులు లేక మనుషులు, లేక జంతువులు తినడం వలన అతనికి దానం చేసినట్లు పుణ్యం లభిస్తుంది''

(బుఖారీ, ముస్లిం).

4, మృతునిపై ఇతరుల ఋణం చెల్లించవలసి ఉంటే, అతని తరుపున దాన్ని చెల్లిస్తే మృతునికి ప్రయోజనం కలుగుతుంది.

హ|జత్ అబూ హురైరా رضي الله عنه కథనం ప్రాకారం; ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''విశ్వాసి ఆత్మ అతను చేసిన అప్పును తీర్చేవరకు (ఆకాశానికి భూమికి మధ్య) ఊగిసలాడుతూ ఉంటుంది'' (సుఖాన్ని

పొందదు) (తిర్మిజీ, సహీహ్ ఇబ్నుమాజ: 1957,హాకిమ్, మజ్మఅల్ ఫతావా:24/311).

హజ్రత్ అబూ ఖతాదా ఒక వ్యక్తి ఋణాన్ని తీర్చేసాననీ చెప్పగా, ప్రవక్త ముహమ్మద్ ﷺ 'అతని చర్మము (సమాధిలో అగ్ని వేడి నుండి) ఇప్పుడు చల్లారిపోయిందనీ' తెలియజేసారు.'' (అహ్మద్, సహీహ్ అల్ జామీ: 2753)

5,మృతునిపై మొక్కుబడి చెల్లించవలసిఉంటే,అతనికి సంభందించినవారు ఆ మొక్కుబడిని చెల్లించడం వలన ప్రయోజనం కలుగుతుంది.

హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా ప్రవక్త ముహమ్మద్ ﷺ గారితో ఇలా విచారించారు: ''మా అమ్మ బ్రతికుండగా ఒక మొక్కుబడి చేసింది. కాని ఆ మొక్కుబడిని తీర్చక ముందే చనిపోయింది. ఇప్పుడు నేను ఆమె తరఫున ఆ మొక్కుబడిని తీర్చవచ్చునా? దానికి ప్రవక్త ముహమ్మద్ ﷺ ''నీవు ఆమె తరఫున మొక్కుబడిని తీర్చు'' అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

6, మరణించిన వ్యక్తి ఉపవాసాలు పాటిస్తాననీ మొక్కుకొని ఉంటే, అతనికి సంబంధించినవారు ఆ ఉపవాసాలను పాటించడం వలన ప్రయోజనం కలుగుతుంది.

ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా సెలవిచ్చారు: ''ఏ వ్యక్తిపై (మొక్కుబడి వలన) అయితే ఉపవాసాలను పాటించవలసి ఉండగా చనిపోతే, ఆ ఉపవాసాలను అతని వలీ (బంధువులు) పాటించాలి'' (బుఖారీ, ముస్లిం).

**ఇమామ్ ఇబ్ను ఖయ్యూమ్ (رحمه الله عليه) గారు ఇలా తెలియజేసారు:**

''విధి గావించబడిన ఉపవాసాలు విధి గావించబడిన నమాజుతో సమానమైనవి. మృతుని తరఫున ఎలాగైతే విధిగాఉన్న నమాజును

ఇతరులు పాటించకూడదో, అలాగే విధిగాఉన్న ఉపవాసాలను కూడా ఇతరులు పాటించకూడదు.

మరణించిన వ్యక్తి తరఫున ఋణ భారాన్ని ఇతరులు చెల్లించడం ఆమోదకరమైన ఆచారం. అలాగే మొక్కుబడివలన పాటించవలసిన ఉపవాసాలను ఇతరులు పాటించడం కూడా ఆమోదకరమైన ఆచారమే.

(తహ్జీబుస్ సునన్:3/276)

7, మృతుడు తనపై విధిగావించబడిన హజ్ విధిని నెరవేర్చని పక్షంలో, లేక హజ్ నెరవేర్చమనీ వసీఅత్ (హితవచనం) చేసి ఉంటే, లేక మృతుడు తన జీవితంలో మొక్కుకున్న హజ్ నెరవేర్చని పక్షంలో, ఇతరులు ఆ హజ్‌ను నెరవేర్చితే అతనికి ప్రయోజనం కలుగుతుంది.

హ్రజత్ బురైదా ؓ కథనం; ఒక మహిళ ప్రవక్త ముహమ్మద్ ﷺ వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నది. ''మా అమ్మ చనిపోయింది. ఆమె హజ్ విధిని నెరవేర్చలేదు. నేనామె తరఫున హజ్ చేయగలనా?'' దానికి ఆయన ﷺ 'అవును' అని అన్నారు. (ముస్లిం).

ఒక మహిళ ప్రవక్త ముహమ్మద్ ﷺ వద్దకు వచ్చి, ''మా అమ్మ హజ్ చేస్తానని మొక్కుకుంది.❁ కాని ఆమె హజ్ చేయకుండానే చనిపోయింది. నేనామె

---

❁ మొక్కుబడిని అరబీ భాషలో 'నజ్ర్' అంటారు. ఎవరైన అనుకున్న ఫలానా పని గనక అయిపోతే లేక నేను ఎదుర్కొంటున్న ఫలానా కఠిన పరీక్ష నుండి నాకు ముక్తి లభిస్తే అల్లాహ్ మార్గంలో ఇంత మొత్తం దానం చేస్తాను అని అనుకుంటే అది 'నజ్ర్' అవుతుంది. దాన్నే తెలుగులో మొక్కుకోవటం అని అంటారు. ఈ మొక్కుబడి ధర్మసమ్మతం గనక దాన్ని చెల్లించటం

తరఫున హజ్ చేయగలనా?'' అని విన్నవించుకున్నది. దానికి ఆయన ﷺ ఇలా బదులిచ్చారు: 'అవును. ఆమె తరఫున హజ్ చేయి. నీ తల్లిపై ఋణ భారం ఉంటే నువ్వు దాన్ని తీర్చేదానివి కదా? అలాగే అల్లాహ్ హక్కును కూడా తీర్చాలి. దాన్ని (మొక్కుబడి) తీర్చగలందులకు అల్లాహ్‌యే ఎక్కువ అర్హుడు' (బుఖారీ).

8, మృతుని చుట్టాలు అతని శ్రేయస్సు కొరకై అల్లాహ్ మార్గంలో దానధర్మాలు చేస్తే, అతనికి ప్రయోజనం కలుగుతుంది.

హ|జత్ ఆయిషా ؓ ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ ﷺ వద్దకు ఒక వ్యక్తి వచ్చి: ''మా అమ్మ హఠాత్తుగా మరణించింది. ఆమె తన **వసీయత్**

---

తప్పనిసరి. ఒక వేళ అధర్మమైన, దైవధిక్కారంతో కూడుకున్న మొక్కుబడి చేసుకుంటే దాన్ని తీర్చటం తప్పనిసరికాదు. మొక్కుబడి కూడా నమాజ్, ఉపవాసాల మాదిరిగా ఆరాధనే. కాబట్టి అల్లాహ్ మినహా ఇంకొకరి ఎవరి పేరున మొక్కుకున్నా అది ''ఆరాధనలో షిర్క్‌కు తావు కల్పించటం''తో సమానమే.

కనుక ప్రవక్త ముహమ్మద్ ఇలా ప్రవచించారు: ''ఎవరయితే అల్లాహ్‌కు విధేయత చూపుతానని మొక్కుకన్నాడో అతను ఆ మొక్కును నెరవేర్చాలి. మరెవరయితే అల్లాహ్‌కు అవిధేయత కనబరుస్తానని మొక్కుకున్నాడో అతను దాన్ని నెరవేర్చకూడదు'' (బుఖారీ).

నేడు మన ముస్లిం సోదరులు దర్గాల దగ్గర, సమాధుల వద్ద తీర్చే మొక్కుబడులు కూడా ఈ షిర్క్ కోవకే చెందుతాయి. అల్లాహ్ మనల్ని షిర్కు నుంచి కాపాడుగాక!

(హిత వచనం) కూడా చేయలేదు. నిశ్చయంగా ఆమెకు సమయం ప్రాప్తమయి ఉంటే దానధర్మం చెయ్యమనీ తప్పక నాతో అనేది. ఆమె కొరకు దానం చేస్తే నాకు మరియు మా అమ్మకు దాని పుణ్యం లభిస్తుందా? అని అడిగాను. దానికి ప్రవక్త ముహమ్మద్ﷺ 'అవును' అని అన్నారు. తరువాత ఆ వ్యక్తి తమ అమ్మ తరఫున దానం చేసాడు'' (బుఖారీ, ముస్లిం).

9, మరణించిన వ్యక్తికి మొక్కల పెంపకం వలన పుణ్యం లభిస్తుంటుంది.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ؓ కథనం; ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''ఏ ముస్లిమయితే చెట్ల మొక్కలను నాటితే, లేక వ్యవసాయం చేస్తే, దాని (ఆ పండిన పంటలో) నుండి పక్షులు లేక మనుషులు, లేక జంతువులు తినడం వలన అతనికి దానం చేసినట్లు పుణ్యం లభిస్తుంది''

(బుఖారీ, ముస్లిం).

# మృతుని ఫర్జ్ నమాజుల కొరత

మృతునిపై విధి గావించబడిన నమాజులను, ఉపవాసాలను మృతుడు సోమరితనంవల్ల లేక ఇతర కారాణాలవల్ల నెరవేర్చని పక్షంలో అతని తరఫున ప్రతి విధి నమాజుకు, లేక ప్రతి ఉపవాసానికి బదులు **ఒక నిర్ణీత వెలను చెల్లిస్తే పరిహారమవుతుందనీ కొంత మంది ప్రజల అభిప్రాయం.** అలా చెల్లించడం ధర్మ సమ్మతము కాదు. అలా పరిహారం చెల్లించాలనీ ఒక్క హదీసు కూడా నిజమైనది లేదు. కానీ ప్రళయ దినాన ఏ వ్యక్తి ఫర్జ్ నమాజ్ కొరతగా ఉంటుందో, ఆ కొరతకు బదులుగా అతని నఫిల్ నమాజులను ఫర్జ్ నమాజులకు సరిసమానం చేస్తారనీ ముహమ్మద్ﷺ తెలియజేసారు.

హజ్రత్ అబూహురైరా రజియల్లాహు అన్హు కథనం;ప్రవక్త ముహమ్మద్ ﷺ ఇలా ప్రవచించారు: ''ప్రళయ దినాన మనిషి అన్నిటికంటే ముందు ప్రశ్నించబడేది అతను విధిగా చేయవలసిన నమాజు గురించి. అతను నమాజు సవ్యంగా ఆచరించి ఉంటే, సాఫల్యాన్ని విజయాన్ని పొందుతాడు. ఒకవేళ నమాజు సవ్యంగా లేదంటే, అవమానపాలవుతాడు, నష్టపోతాడు. కొందరు (సోమరితనం వల్ల) నమాజులను (చదవని కారణంగా) కొరత చేసిఉంటే, ప్రళయ దినాన అల్లాహ్ ఇలా అంటాడు: ''నా దాసుడు నఫిల్ (ఆదనపు) నమాజు ఏమైనా నెరవేర్చి ఉంటే వాటి ద్వారా విధి గావించబడిన నమాజుల కొరతను పూర్తి చేయండి'' అని ఆజ్ఞాపిస్తాడు. అలా (విశ్వాసులుగా ఉన్న) వారి (ఇతర) కర్మల పట్లా ఇదే విధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది''

(తిర్మిజీ, నసాయి, అబూదావూద్, సహీహుల్ జామి: 2016).

**ముఖ్య గమనిక:** మరణించిన బంధుమిత్రులకు పుణ్యాలు లభించుటకై కొంత మంది ముస్లిం ప్రజలు ఇతరులను పిలిపించి, లేక ఇతరులను డబ్బులు ఇచ్చి, లేక అన్నం పెట్టి ఖుర్ఆన్ పారాయణ సభలు నిర్వహిస్తారు. కాని ఇలాంటి ఆచారానికి ఖుర్ఆన్, హదీసుల ద్వారా ఎలాంటి ఆధారం లేదు. మరియు ఇది ధర్మపద్ధతి కూడా కాదు. **ఇది ఒక బిద్అత్ ఆచారంగా** ప్రజల్లోకి చేరినట్లు అనేక ధర్మ గురువుల అభిప్రాయం.

ఒకవేళ పుణ్యకార్యాల కారణంగా మరణించిన బంధుమిత్రులకు పుణ్యం చేరాలనుకుంటే మదరసాలలో ఖుర్ఆన్ మరియు హదీసు చదివే విద్యార్థుల కొరకు దానంగా ఇస్తే, పుణ్యం చేరుతుంది. లేక వాటి కట్టడాల కొరకు దానం చేస్తే, పుణ్యం చేరుతుంది.

# శ్రాద్ధకర్మ (దివిసం)

శ్రాద్ధకర్మ అంటే హైందవులు చనిపోయినప్పుడు 10వరోజు మరియు 20వ రోజు లేక40వ రోజు, మరియు సంవత్సరానికి ఒక సారి మరణించిన వారి శ్రేయస్సు కొరకు పూజారులను ఆహ్వానించి చదివింపులు జరుపుతారు. రాత్రంతా భక్తి కథల సభలను ఏర్పాటు చేస్తారు. మరియు భోజనాల ఏర్పాటు చేస్తారు. తరువాత పూజారులకు కొంత ధనాన్ని విరాళంగా కూడా ప్రసాదిస్తారు. ఇలా నిర్వహించే కార్యాలను శ్రాద్ధకర్మ లేక దివిసం అంటారు.

అదే విధంగా కొంత మంది అమాయకమైన ముస్లిం ప్రజలు దస్మా, బీస్మా, చాలిస్మా, మరియు బర్సీ అంటూ ఖుర్ఆన్ పారాయణం చేసేవారిని పిలిపించి ఖుర్ఆన్ చదవింపులు జరుపుతారు. మరియు కొందరు రాత్రంతా సియర్ పేరున కొన్ని భక్తి పుస్తకాలను, భక్తి పాటలను పాడుతారు. మరియు భోజనాల ఏర్పాటు చేస్తారు. తరువాత పారాయణం చేసేవారికి కొంత ధనాన్ని విరాళంగా కూడా ప్రసాదిస్తారు. మరియు మృతునికై ప్రార్థనలు, ఫాతిహాలు చేస్తారు. గురువులు మరియు గ్రంథాలు వేరయినప్పటికి ఆచార విధానాలు ఒక్కటే కదా.

కొంత మంది ప్రజలు **పెద్దల పండుగ** (బడోంకి ఈద్ లేక ముర్దోంకి ఈద్) పేరున **షబేబరాత్** రోజు మరియు **బక్రీద్** పండుగ రోజు అనేక రకాల పండ్లు, ఫలాలు, అన్నపానియాలు మరియు ఇతర వస్తువులు ఒక గదిలో పెట్టి సాంబ్రాణి పొగలు రేకెత్తించి ఫాతిహాలు చేస్తారు. ఖుర్ఆన్ నుండి ప్రత్యేకమైన సూరాలను వందల సార్లుగా పఠించి, వారి కొరకు ఆ పుణ్యాన్ని సమర్పించినట్లు భావిస్తారు. మరియు ఆ రోజులను పెద్దల శ్రేయస్సు కొరకై చేసే పండుగలుగా భావిస్తారు.

కొంత మంది ప్రజలు ఆ దినాలలో పెద్దల శ్రేయస్సు కొరకు తమ బంధుమిత్రుల సమాధులను ప్రత్యేకంగా సందర్శిస్తారు. మరియు వారి పేరున ఫాతిహాలు చేస్తారు. ఆ సమాధులపై దీపాలు, అగర బత్తీలు వెలగిస్తారు, మరియు తీపు వస్తువులు కూడా పంచిపెట్తారు. అలా ఇస్లాం ధర్మంలో లేనటువంటి అనేక విధాల ఆచారాలు పాటించి మరణించిన బంధు మిత్రులకు మేలు చేస్తున్నామనీ విశ్వసిస్తారు.

ప్రవక్త ముహమ్మద్ﷺ అలాంటి ఆచారాల గురించి మనకేమైన ఆదేశాలు జారిచేసారా? లేక ప్రవక్త ముహమ్మద్ﷺ అనుచరులు అలాంటి కార్యాలు పాటించారా? మీరే ఆలోచించండి! ముమ్మాటికి వారు ఎన్నటికి అలా చేయనే లేదు. అలా చేసిఉంటే హదీసు గ్రంథాలలో వాటి ప్రస్తావన తప్పక వచ్చి ఉండేది. అలా హదీసు గ్రంథాలలో వాటి గురించి ఎలాంటి ప్రస్తావన లేదంటే, ఆ కార్యాలను పాటించడం ముస్లిం సమాజానికి ధర్మమేనా?

అటువంటి కార్యాలు పాటించడం ధర్మ విరుద్ధం అనుకుంటే, ఈ రోజు నుండే దస్మా, బీస్మా, చాలిస్మా, మరియు బర్సీ, పెద్దల పండుగలు అనే ఆచారాలను విడిచి ధర్మ పరంగా ధర్మ విధానంలో ఉన్న కార్యాలను మాత్రమే పాటించండి. దాని వల్ల మీరు అల్లాహ్ ప్రేమను పొందుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ‘‘(ఓ ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు: మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు. అపారంగా కనికరించేవాడు’’.–ఇంకా వారికి ఇలా చెప్పు: ‘‘మీరు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు విధేయులై

ఉండండి. ఒక వేళ వారు విముఖత చూపితే అల్లాహ్ తిరస్కారులను ఏ మాత్రం ఇష్టపడడు'' (ఆలి ఇమ్రాన్: 31-32).

మరోచోట అల్లాహ్ ఇలా హెచ్చరించాడు: ''ప్రవక్త (ముహమ్మద్) మీకు ఇచ్చిన దానిని తీసుకోండి. ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి'' (సూరతుల్ హష్ర్:7).

అల్లాహ్ లేక ప్రవక్త ముహమ్మద్ﷺ ద్వారా ప్రచురించని కార్యాలను ఇతరుల ద్వారా ప్రచురించబడిన లేక ఆచరించబడిన కార్యాలను పుణ్యంగా భావించి ఆచరించే కార్యాలనే **'బిద్అత్'** అంటారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాబిర్ؓ కథనం; ప్రవక్త ముహమ్మద్ﷺ ఇలా ప్రవచించారు: ''వాక్యాలలో అన్నిటికంటే సత్యమైన వాక్యం అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్). మరియు మార్గాలన్నిటిలోకి అతి ఉత్తమమైన మార్గం ముహమ్మద్ﷺ మార్గం. మరియు ఆచారాలలో అతి చెడు ఆచారం క్రొత్త ఆచారాలు, మరియు ప్రతి క్రొత్త ఆచారం **బిద్అత్,** ప్రతి **బిద్అత్ మార్గ విహీనమైనది.** మరియు **ప్రతి మార్గ విహీనం నరకానికి తీసుకు వెళ్ళుతుంది**..............(ఇబ్ను ఖుజైమా, సహీహుల్ జామే:1353)

అల్లాహ్ మనందరికి సద్బుద్ధిని ప్రసాదించి, అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ﷺ వారి విధేయతను పాటించేవారిలో చేర్చు. ఓ అల్లాహ్! మా కంటే ముందు చనిపోయినవారందరనీ క్షమించు, వారందరికీ స్వర్గాన్ని ప్రసాదించు. మా కార్యాలను స్వీకరించి, మాకు పుణ్యాలను ప్రసాదించు. మా పాపాలను క్షమించి, స్వర్గాన్ని ప్రసాదించు. ఆమీన్.